క్లుప్తంగా

దాతలకు సత్కారం


దాతలను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

కాళ్ల : మండలంలోని కోమటిగుంటలో కోదండ రామాలయం 14వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. మాజీ సర్పంచ్ యలమంచిలి వెంకటరమణ, సత్యవతి దంపతుల ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నసమారాధనకు సహకరించిన దాతలను సత్కరించారు.

చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపండి

ఉండి : భవిష్యత్‌లో చిరుధాన్యాలు శాసించబోతున్నాయని, కావున చిరుధాన్యాల సాగుపై రైతులు ఎక్కువగా దృష్టి పెట్టాలని కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని కేవీకేలో శనివారం చిరుధాన్యాల సాగుపై శాస్త్రవేత్తలు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ డెబోరా మెస్సియానా, డాక్టర్ వినయలక్ష్మి, డాక్టర్ రాజేష్ చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శిక్షణ అందించారు. మనిషికి కావాల్సిన అన్ని రకాల ప్రోటీన్స్, మినరల్స్ వంటి పోషకాలు చిరుధాన్యాల్లో అధికంగా ఉన్నాయని, కాబట్టి ఆసక్తి కలిగిన రైతులు, యువత చిరుధాన్యాల సాగుపైపు మొగ్గు చూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా చిరుధాన్యాలను పండిచడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఖజానా అధికారి గణేష్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం భీమవరంలో జిల్లా ఖజానా అధికారి ఎ.గణేష్‌కు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాతల జేమ్స్, ఎస్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన పింఛన్ బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పేఫిక్సేషన్ స్టేట్‌మెంట్స్ ఇవ్వాలని, కరువుభత్యం బకాయిలు, పీఆర్సీ ఎయియర్స్ వంటివి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం భీమవరం శాఖ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ పాల్, కోశాధికారి పీవీఆర్ఎస్ఎస్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ఆకివీడు : దుంపగడప గ్రామంలో శనివారం గ్యాస్ లీక్ అయి చిట్టిబొమ్మ ఆంజనేయులుకు చెందిన తాటాకిల్లు దగ్ధం అయ్యింది. రూ. లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటల్ని అదుపు చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం : రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గెద్దం భారతి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య విషయంలో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆరోగ్యానికి పెద్దపీట వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లీలా దుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలో తల్లిని కొట్టి గాయపరిచారని ఫిర్యాదు

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఆస్తి తగాదాలో తల్లిని కొట్టి గాయపరిచారని వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన తన తల్లిని ఆస్తి తగాదా విషయమై మల్లాడి దిలిప్ నాగేంద్ర, మరో ఏడుగురు కొట్టి గాయపరిచారని మల్లాడి గోవిందు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


శివాలయ పునఃనిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న పీవీఎల్ నర్సింహరాజు, సర్పంచ్ సాంబశివరావు

ఉండి : ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని చెరుకువాడలో శనివారం సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో శివాలయ పునః నిర్మాణ పనులకు భూమిపూజా నిర్వహించారు. సర్పంచ్ సాంబశివరావు, ముత్యాలకృష్ణారావు దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. చెరుకువాడలో రూ.1.50 కోట్లతో పురాతనమైన చెన్నమల్లేశ్వరస్వామి, సంతాన గోపాలస్వామి ఆలయాల పునః నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ ఆశీస్సులతో చెన్నమల్లేశ్వరస్వామి ఆలయానికి రూ.90 లక్షలు, సంతాన గోపాలస్వామి ఆలయానికి రూ.60 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ప్రజా విరాళం రూ.50 లక్షలు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి పెరికెల చినగంగయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ(సత్తిబాబు), ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, మహంకాళి, నడింపల్లి కృష్ణంరాజు, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, మాజీ సర్పంచ్ జయమంగళ మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన


విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం : విత్తన గుళికల తయారీపై కొణితివాడ శివారు గవరపాలెంలో శనివారం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీఆర్‌సీ బీశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవికాలంలో ఉపయోగపడే విధంగా బెండ, బీర, మినుము, పెసర, చిక్కుడు, ఆనబ తదితర విత్తనాలను నిల్వ ఉంచి వర్షం పడగానే మొలకెత్తే విధంగా ప్రత్యేకంగా సేంద్రియ పద్ధతిలో గుళికలను తయారు చేయడం జరుగుతుందన్నారు. విత్తనాలకు ముందుగా ఘన జీవామృతాన్ని వేసి తదుపరి సేంద్రియ పదార్థంతో గుళికలుగా తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ విత్తనాలను వేసవిలో చేలల్లోగాని, గట్లపైగాని చల్లుకుంటే తొలకరి చినుకులు పడగానే మొక్కలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, అశోక్, బి.నాగరాజు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు పనులను అడ్డుకున్న అధికారులు

పాలకోడేరు : మండలంలోని గరగపర్రు గ్రామంలో ఒక రాజకీయ నాయకుని విగ్రహ ఏర్పాటు పనులను స్థానికులు, అధికారులు శనివారం అడ్డుకున్నారు. ఐదేళ్ల క్రితం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదం రాష్ట్ర వ్యాప్తంగా చర్చాంశనీయమైంది. ప్రస్తుతం అక్కడ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు జరుతుతున్నాయి. ఇదే ప్రాంతంలో ఒక రాజకీయ నాయకుని విగ్రహం ఏర్పాటు చేయడానికి ఐదు నెలల క్రితం గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు తమ్మిశెట్టి సత్యనారాయణ పూనుకోవడంతో అంబేడ్కర్ వాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పట్లో ఈ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటుకు దిమ్మె నిర్మించారు. ప్రస్తుతం దిమ్మెపై విగ్రహం ఏర్పాటు చేయడానికి పనులు చేపట్టడంతో విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కె. రాజేష్ పనులు నిలుపుదల చేయించారు. ఇరువర్గాల వారితో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఎస్‌ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు

సాక్షి, భీమవరం : మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు (ఏపీఎంఎస్‌ఆర్‌యూ) సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను ప్రభుత్వాలు అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు కోరారు. భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాల్లో రెండు రోజులపాటు నిర్వహించే ఏపీఎంఎస్‌ఆర్‌యూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. బహుళ జాతి సంస్థలు మెడికల్ రిప్రజెంటేటివ్స్‌ను ఉద్యోగాల నుంచి అన్యాయంగా తొలగిస్తున్నారని, చట్ట ప్రకారం మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మందులను అనైతిక పద్ధతుల్లో అమ్మకాలు చేయలని ఫార్మా యాజమాన్యాలు ఒత్తిడి తేవడాన్ని తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు. యూనిఫాం కోడ్ ఆఫ్ ఫార్మా స్యూటికల్స్ మార్కెటింగ్ ప్రాక్టీస్‌ను ప్రభుత్వం అమలులలోకి తీసుకువచ్చి అనైతిక మందుల అమ్మకాలు, మార్కెటింగ్ విధానాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. వైద్యం, మందుల కంపెనీలను బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యువీ కృష్ణయ్య, ఎస్.శిరీష్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, కెఎంఎస్ సుందర్రాజు, డాక్టర్ జి.గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం


వెంప సొసైటీ బ్యాంకు త్రి సభ్య కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్ : సహకార పరపతి సంఘ సభ్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందని త్రిసభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని వెంప గ్రామంలో వెంప సహకార పరపతి సంఘం ఏర్పడి 100 సంవత్సరాలు పైగా కావడం, సొసైటీ బ్యాంకు లావాదేవీలు కోట్లలో జరగడమే కాకుండా సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసి బ్యాంకు అభివృద్ధిలో ముందంజలో ఉండటంతో జిల్లా డీసీసీబీ ద్వారా అనంతపురం సహకార సంఘాల సీఈవోలు, పీఏసీ అభివృద్ధి సిబ్బంది శనివారం సందర్శించి సంఘాల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ ఎప్పటికప్పుడు లావాదేవీలు జరిపితే సంఘం అభివృద్ధి చెందడమే కాకుండా వ్యాపారం మరింత పెరుగుతుందన్నారు. సొసైటీ సంఘం ఆధ్వర్యంలో రాబడి వచ్చే మార్గాలను అన్వేషించాలని, సూపర్‌మార్కెట్‌లు నెలకొల్పితే మరింత ఆదాయం వస్తుందన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సొసైటీ అభివృద్ధికి ఎంతో సహకరించడం వల్లే సాధ్యం అయ్యిందన్నారు. అనంతరం సంఘాల అభివృద్ధి పరిచేందుకు పలు అంశాలపై అనంతపురం సంఘ చైర్మన్ సానబోయిన త్రిమూర్తులు, సభ్యులతో చర్చించారు. వెంప సహకార పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేసి చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు, సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్యాంకు కార్యదర్శులు, సిబ్బంది ఖాతాదారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చెప్పులు తిరిగివ్వమన్నందుకు చాకుతో దాడి

పాలకోడేరు : తన దగ్గర ఐదు రోజుల క్రితం తీసుకున్న చెప్పులు తిరిగి ఇవ్వమని అడిగినందుకు కూరలు కోసుకునే కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని విస్సాకోడేరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కంచరదిబ్బకు చెందిన పెదపూడి ప్రేమ్‌కుమార్ తన స్నేహితుడైన కొడమంచిలి అనిల్ వద్ద ఐదు రోజుల క్రితం చెప్పులు తీసుకున్నాడు. అవి తిరిగి ఇవ్వమని అనిల్ శనివారం నాడు అడిగితే.. ఏంట్రా ఇచ్చేది.. అంటూ అక్కడే ఉన్న కూరలు కోసుకునే చాకుతో అనిల్‌ను గాయపరిచాడు. అడ్డు వచ్చిన అనిల్ తల్లి పైనా కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన తల్లీకొడుకులిద్దరూ చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రిలో చేరారు. బాధితుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు.

సీతారాములకు పంచామృతాభిషేకం



పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధిలోని రామాలయంలో స్వామివార్లకు పంచామృతాభిషేకం చేశారు. శనివారం ఉదయం ఆలయ అర్చకుడు ఆచారి స్వామివారికి అభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీకాకొల్లు వెంకన్న, విన్నకోట శ్రీరంగనాయకులు, బదరీ, ఉప్పరి పాల్గొన్నారు.

నేడు ఛాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 4 గంటల వరకూ కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, మరిన్ని ఇంటర్నేషనల్ బ్యాంకులు పాల్గొంటాయన్నారు. ఈ ఇంటర్వ్యూలో పాల్గొనే అభ్యర్థులు 2019 నుంచి 2023 (ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న) విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్ జెరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ : 9701394660, 9849712739 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పంచారామ క్షేత్రంలో వివాహ మండపాల లైసెన్స్‌కు వేలం

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరంలోని పంచారామ క్షేత్రం శ్రీ ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో వివాహాది శుభకార్యాలకు వివాహ మండపాలు వేసుకొను లైసెన్సుకు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించినట్లు ఈఓ ఎన్.అరుణ్‌కుమార్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేది వరకూ రెండేళ్ల కాలపరిమితికి ఈ టెండర్ వర్తింస్తుందన్నారు. టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించగా అనిశెట్టి మురళీ కృష్ణ మొదటి ఏడాదికి రూ.4,52,000కు, రెండో సవత్సరానికి రూ.4,97,200కు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు నాచు శ్రీ వల్లి, నల్లం రఘుబాబు, లక్కు త్రిమూర్తులు, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ, వర్ధినీడి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అయిభీమవరంలో ముగిసిన జాతర

ఆకివీడు : అయిభీమవరంలో గ్రామ దేవతలు వీర్లంకమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల జాతర శనివారం ముగిసింది. వారం రోజుల పాటు గ్రామంలో జాతర కార్యక్రమాలు జరిగాయి. ఆఖరి రోజు అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో పలు శక్తి వేషాలు, గరగ నృత్యాలు, వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పిస్తారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

శ్రీవారికి శాంతి కల్యాణం

భీమవరం(ప్రకాశం చౌక్) : జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని శనివారం శ్రీవారికి, అమ్మవార్లకు శాంతి కళ్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం


స్థానిక ఆనాల చెరువు వద్ద నిర్మాణంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

ఆకివీడు : స్థానిక ఆనాల చెరువు గట్టు వద్ద వేంచేసియున్న పురాతన దేవాలయం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. స్థానిక జూపూడి కృష్ణమూర్తి జమిందార్ జ్ఞాపకార్థం వారి సతీమణి సూర్యకుమారి, కుమారులు నవగ్రహ మండపం నిర్మాణానికి రూ.6 లక్షలు విరాళం అందజేశారు. అలాగే స్థానిక కృష్ణదేవరాయ నగర్ కాలనీకి చెందిన మోటుపల్లి కృష్ణ(ఊక కృష్ణ) ఆలయ నిర్మాణ నిమిత్తం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు జంపన సుబ్రహ్మణ్యంరాజు(జేఎస్సార్), నేరెళ్ల రామకృష్ణ అభినందించారు.

ప్రత్యేక లోక్‌అదాలత్‌లో 2 కేసుల పరిష్కారం


మాట్లాడుతున్న మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.శ్రీసత్యాదేవి

సాక్షి, భీమవరం : వివాహ సంబంధమైన కేసుల పరిష్కారానికి శనివారం భీమవరంలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి, న్యాయసేవాదికార సంస్థ చైర్‌పర్సన్ పి.శ్రీసత్యాదేవి ప్రత్యేక లోక అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు కేసులకు సంబంధించి భార్య, భర్తలు ఇరువురితో మాట్లాడి కలిసి జీవించే విధంగా రాజీ చేశారు. ఈ అదాలత్‌లో 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్, సభ్యులు టి.లక్ష్మి, వి.కరుణాకరరావు పాల్గొన్నారు.

భీమవరం మండలంలో భారీ వర్షం

భీమవరం అర్బన్ : మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, రాయలం, చినఅమిరం, గొల్లవానితిప్ప, గూట్లపాడు, అనాకోడేరు, కొమరాడ తదితర గ్రామాలలో భారీ వర్షం కురిసింది. సుమారు 4 గంటల పాటు ఏకధాటిగా వర్షం పడటంతో జనజీవన స్థంభించిపోయింది. దీంతో పలువురు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షాలు వల్ల చేపలు, రొయ్యలకు తెగులు వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆక్వా రైతులు చెబుతున్నారు.

అకాల వర్షంతో దిగుబడికి నష్టం

ఆకివీడు : అకాల వర్షంతో పూత దశలో ఉన్న రబీ దిగుబడులకు కొంత నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. చెదురు మదురు జల్లులతో పాటు పలు చోట్ల కొద్ది పాటి వర్షం కురిసింది. వర్షంతో జనజీవనానికి కొంత అంతరాయం ఏర్పడింది. ఇప్పటివరకూ వరి చేలకు ఏ విధమైన నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

పథకాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి

యలమంచిలి: ప్రభుత్వ పథకాల లబ్ధిపొందాలంటే ప్రతి ఒక్కరికీ నూతన ఆధార్ కార్డు ఉండాలని ఎంపీడీవో చివటం త్రిశూలపాణి చెప్పారు. మేడపాడు గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన పిల్లలందరికీ పేరు పెట్టిన వెంటనే ఆధార్ కార్డు తీసుకోవాలని ఆయన చెప్పారు. మేడపాడు, యలమంచిలి గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మొదటి సారిగా వచ్చిన వారు ఆధార్ ఉచితంగా పొందాలన్నారు. 2014 ముందు ఆధార్ కార్డు తీసుకుని ఇంతవరకు అప్‌డేట్ చేయించుకోనివారు రుసుము చెల్లించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మన్నె మాధురి ఉన్నారు.

మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సాక్షి, భీమవరం : ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులు తీసుకురావాలని స్వేచ్ఛ ఫౌండేషన్ ఏపీ జనరల్ సెక్రెటరీ శ్రీపతి రాయ్ అన్నారు. శనివారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ అప్లికేషన్ అనే అంశంపై ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం సిలబస్‌కే పరిమితం గాకుండా నూతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ గూగుల్ సర్టిఫికెట్ కోర్స్‌కు తమ కళాశాలను ఎంపిక చేయడం ఆనందదాయకమని ఈ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి గూగుల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు ఇంటన్షిప్ వంటి అవకాశాలు కూడా లభిస్తాయని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్, అసోసియేట్ ఎంకే కామేశ్వరరావు, పి.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్ణాహుతి.. శాంతికల్యాణం


ఆలయం వద్ద పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పుష్కర మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద 12 హోమాలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. 20 మంది వేద పండితులు, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వామివారి కల్యాణం, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కంతేటి వెంకటరాజు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ దాతలు, భక్తుల సహకారంతో సుమారు రూ.25 లక్షల వ్యయంతో పుష్కర మహోత్సవాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కుక్కల బాల వెంకటరత్నం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనార్దన స్వామికి వెండి కవచం సమర్పణ


స్వామివార్లకు వెండి ఆభరణం బహూకరిస్తున్న దాతలు

కాళ్ల : మండలంలోని బొండాడ గ్రామంలో వేంచేసియున్న పార్వతీ సమేత భోగేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన మందపాటి రామారావు, సావిత్రమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు విశ్వేశ్వరరావు, కోటేశ్వరరావు, వెంకన్న శ్రీజనార్దన స్వామివారికి సుమారు రూ.12 లక్షల విలువచేసే 14.5 కిలోల వెండి సర్వాంగమును (కవచం) బహుకరించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు దంపతులచే పార్వతి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు బంగారు ముక్కుపుడకలు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి అభినందించారు. భోగేశ్వరస్వామి, జనార్దనస్వామి దేవస్థానాల చైర్మన్లు నందుల నారాయణమూర్తి, మందపాటి రాము, ఈఓ వేగేశ్న ఆంజనేయరాజు, ఆలయాల ప్రధాన అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ

ఆకివీడు : ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా కేంద్రాల్లో శనివారం ఫ్లెయింగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు చేసింది. స్థానిక జాతీయరహదారి పక్కన ఉన్న కార్తికేయ జూనియర్ కాలేజీలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 576 మంది విద్యార్థులు ఇంటర్ సెకండ్ ఇయర్ ఇంగ్లీష్ పేపరు రాయాల్సి ఉండగా, 553 మంది పరీక్ష రాశారు. 23 మంది గైర్హాజరయ్యారు.